ప్రజాశక్తి
బుధవారం 29 మే 2024 5 అనంతపురం

82 వస్తే.. 18 వేశారు..!

◆'పది' మూల్యాంకనంలో విద్యార్థికి అన్యాయం
◆రీ వెరిఫికేషన్‌తో వెలుగుచూసిన వాస్తవం

ప్రజాశక్తి బత్తలపల్లి

ఏ విద్యార్థికైనా 10వ తరగతి ఎంతో విలువైనది. అందులో వచ్చే మార్కులు విద్యార్థి భవిష్యత్తు జీవితాన్ని నిర్దేసిస్తాయి. అలాంటిది బాగా చదివే విద్యార్థి అధికారుల చేసిన తప్పిదానికి బలయ్యాడు. అన్ని సబ్జెక్టుల్లో 90కి పైగా మార్కులు వస్తే ఒక్క ఇంగ్లీషులో మాత్రం కేవలం 18 వచ్చాయి. దీంతో విద్యార్థి పది తప్పినటుట్టు మార్కుల జాబితా వచ్చింది. స్వతహాగా బాగా చదివే విద్యార్థి కావడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దీనిపై రీ వెరిఫికేషన్ కోరుతూ పదవ తరగతి బోర్డును ఆశ్రయించారు. రీవెరిఫికేషన్ చేయించగా విద్యార్థికి 18కాదు.. 82 మార్కులు వచ్చాయని తేల్చారు. ఈ ఘటన విద్యాశాఖ అనుసరిస్తున్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. బాధిత విద్యార్థి తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...


BOARD OF SECONDARY EDUCATION
ANDHRA PRADESH
SSC PUBLIC EXAMINATIONS, MARCH 2024
REVERIFICATION / RECOUNTING OF MARKS

Roll Number: 2426125124
Subject: English

There is "Change" in your marks from 18 to 82

Note:
1) Verified Posting and totalling of marks Provisions
2) Verified whether marks awarded and posted for all correct answers.
3) Verified those answers which were not awarded marks.
**There is no provision for Re-valuation

రీవెరిఫికేషన్‌లో 82 మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థి అంజి మార్కుల జాబితా

శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండల కేంద్రానికి చెందిన శ్రీజ్యోతి హైస్కూల్‌లో గోగుల అంజి అనే విద్యార్థి ఈ ఏడాది 10వ తరగతి చదివాడు. ఇటీవల జరిగిన పది పూర్తి స్థాయి పరీక్షల్లో అన్ని సబ్జెక్టుల్లోనూ 90 మార్కులు పైబడి సాధించాడు. ఇంగ్లీష్ సబ్జెక్టులో కేవలం 18 మార్కులే వచ్చాయి. దీంతో పరీక్షల్లో తప్పినట్లు రిజల్ట్ వచ్చింది. విద్యార్థి బాగా చదివేవాడు కావడంతో పాఠశాల ప్రిన్సిపాల్ మిడతల లక్ష్మీనారాయణ విద్యార్థి తండ్రితో మాట్లాడి రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేయించాడు. ఈ మేరకు ఇటీవల అధికారులు విద్యార్థి అంజి ఇంగ్లీషు ప్రశ్నాపత్రాన్ని రీవెరిఫికేషన్ చేశారు. రీ వెరిఫికేసన్‌లో 82 మార్కులు వస్తే 18 మార్కులు తప్పుగా వేసినట్లు గుర్తించారు. అధికారులు చేసిన తప్పును సరిదిద్ది విద్యార్థి 82 మార్కులు సాధించినట్లు వివరాలను నమోదు చేసి మార్కుల జాబితాను పంపారు. కాగా అధికారులు చేసిన తప్పిదానికి తమ కుమారుడు నెల రోజుల పాటు తీవ్ర మానసిక క్షోభ అనుభవించాడని, ఏదైనా జరగరానిది జరిగిఉంటే బాధ్యులు ఎవరంటూ విద్యార్థి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో తన కుమారుడికి జరిగిన నష్టం మరే విద్యార్థికీ జరగకుండా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థి అంజి

కొనసాగుతున్న వేట..!

◆పడుతున్న వేటు ◆తాడిపత్రి ఘటనపై వరుస చర్యలు
◆ఓట్ల లెక్కింపు అనంతరం భద్రతపై దృష్టి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల రోజు తాడిపత్రిలో పెద్దఎత్తున చోటు చేసుకున్న ఘర్షణపై వేట కొనసాగుతోంది. ఇందులో 700 మందిపై కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో ఇప్పటి వరకు 122 మంది అరెస్టు అయ్యారు. ఇంకా 600 మంది వరకు అరెస్టు అవ్వాల్సి ఉంది. కేసుల్లో చిక్కుకున్న వారందరూ ఇతర ప్రాంతాలకెళ్లి తలదాచుకుంటున్నారు. వారి కోసం ప్రత్యేకంగా నాలుగైదు బృందాలు వేటను ప్రారంభించాయి. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారిని అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ముఖ్య నేతలు మాత్రం న్యాయస్థానంను ఆశ్రయించి బయట ఉండే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు.

పడుతున్న వేటు

తాడిపత్రి ఘర్షణను ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకున్న విషయం తెలిసిందే. ఇదివరకు డిఐజి అమ్మిరెడ్డి బదిలీ అయ్యారు. ఎస్పీ అమిత్ బర్దర్, డీఎస్పీ గంగయ్య, సిఐ మురళీకృష్ణలు సస్పెండ్ అయ్యారు. ఇంతటితోనే వేటు తప్పలేదు. తాజాగా ఎఆర్ ఎఎస్పీ, స్పెసల్ బ్రాంచ్ సిఐలను బదిలీ చేసి రాష్ట్ర కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్‌పైనా సస్పెన్షన్ వేటు పడింది. ఇలా వరుసగా పోలీసు శాఖలో అధికారులపై వేటు పడుతూ వస్తోంది. ఇంకా ఎంత మందిపై ఈ చర్యలుండనున్నాయన్న గుబులు ఆ శాఖలోని సిబ్బందిలో నెలకొంది. ఇంతటితోనే ఆగకుండా శాఖపరమైన విచారణ కొనసాగుతోంది. ఈ విచారణలో బాధ్యులెవరన్నది తేలితే చట్టపరమైన చర్యలూ ఉండే అవకాశాలున్నాయి కొత్తగా వచ్చిన పోలీసు ఉన్నతాధికారులు పాత తప్పిదాలను సరిచేసే రాబోయే ఓట్ల లెక్కింపుపై దృష్టి సారిస్తున్నారు.

ఓట్ల లెక్కింపు తరువాత ప్రశాంతతపై దృష్టి

ఓట్ల లెక్కింపు తరువాత జిల్లాలో ఎక్కడా ఎటువంటి ఘటనలూ చోటు చేసుకోకుండా ఉండే విధంగా కొత్తగా ఎస్పీ బాధ్యతలు చేపట్టిన గౌతమి శాలి దృష్టి సారించారు. అల్లర్లు జరిగితే ఏ రకంగా నివారించాలన్న కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం నాడు పరేడ్ గ్రౌండ్ మాంక్ డ్రిల్ లాగా ప్రాక్టీస్ కూడా చేయడం గమనార్హం. తాడిపత్రి అల్లర్లలో భాగస్వామ్యులైనట్టు గుర్తించిన 150 మంది పై రౌడీషీట్‌లు సైతం ప్రారంభించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండే విధంగా సిబ్బంది అలర్టుగా ఉండాలని హెచ్చరికలు సైతం చేస్తున్నారు. కేసుల్లో ఉన్నవారు.. పాత నేరస్తులను పిలిపించి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కౌంటింగ్ రోజు పూర్తి స్థాయి బందోబస్తు ఏర్పాట్లను చేపట్టారు.

సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు, అభ్యర్థులు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట చర్యలు

◆అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలి
◆కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సజావుగా, ప్రశాంతంగా ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు అన్ని చర్యలూ చేపడుతున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా॥వి.వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం నాడు అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సాధారణ ఎన్నికలు – 2024 కౌంటింగ్ పై అభ్యర్థులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అభ్యర్థులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కౌంటింగ్ నిర్వహించేందుకోసం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించేందుకు కోసం అభ్యర్థి, ఏజెంట్ రూమ్‌ని ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద శాంతి భద్రతలను పాటించేవారిని ఏజెంట్లుగా నియమించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కోసం అధికారులను నియమించి శిక్షణ ఇచ్చామన్నారు. కౌంటింగ్ రోజు పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్‌ని ఉదయం ఏడున్నర గంటలకు తెరుస్తామన్నారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ టేబుల్స్ మరిన్ని పెంచాలని, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారుల కార్యాలయం వద్ద ఏజెంట్లకు ఐడి కార్డులు ఇవ్వాలని, తదితర అంశాలను అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, పార్లమెంటరీ నియోజకవర్గం ఎఆర్ఒ రమేష్ రెడ్డి, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రవికుమార్‌తో పాటు వివిధ పార్టీల అభ్యర్థులు పాల్గొన్నారు.

సజావుగా సప్లిమెంటరీ పరీక్షలు

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను జిల్లాలో సజావుగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం నాడు అనంతపురంలో జరుగుతున్న పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను కలెక్టర్ పరిశీలించారు. ఆలమూరు రోడ్‌లో ఉన్న ఎస్ఆర్.జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా సౌకర్యాల కల్పన ఉండాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డివిఈవో వెంకటరమణ నాయక్, కళాశాల ప్రిన్సిపల్ జగదీష్, మేనేజ్మెంట్ చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు. అంతకు ముందు నగరంలోని రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్లో పదవ తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఇఒ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రూల్స్ డ్రాఫ్ట్‌లో సొసైటీ, ఎగ్జిక్యూటీవ్ పదాలను తొలగించాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సర్వీస్ రూల్స్ డ్రాఫ్ట్‌లో సొసైటీ, ఎగ్జిక్యూటీవ్ కమిటీ అనే పదాలను తొలగించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎపి మోడల్ స్కూల్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వెంకటేశులు అధ్యక్షతన సర్వీస్ రూల్స్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వీస్ రూల్స్ డ్రాఫ్ట్‌లో సొసైటీ అనే పదాన్ని, ఎగ్జిక్యూటివ్ కమిటీ అనే పదాలను తొలగించాలన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు వర్తింప చేయాలన్నారు. పిజిటి ప్రిన్సిపాల్‌కు గెజిటెడ్ హోదా ఇవ్వాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పోస్ట్ అదనంగా క్రియేట్ చేయాలన్నారు. ప్రిన్సిపాల్ పోస్టుకు విద్యార్హతల్లో బిఇడితోపాటు పండిట్ ట్రైనింగును చేర్చాలన్నారు. ప్రిన్సిపాల్‌కు ప్రమోషన్ చానల్‌ని కల్పించి డిఇఒ, ఎడి డైట్ ప్రిన్సిపాల్, తత్సమాన పోస్టులకు ప్రమోషన్‌పై వెళ్లేందుకు అవకాశం కల్పించాలన్నారు. పీజీటీ హిందీ పోస్ట్ క్రియేట్ చేసి టీజీటీ హిందీలకు ప్రమోషన్స్ కల్పించాలన్నారు. పీజీటీలకు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ పోస్ట్‌తో పాటు డివైఇఒ, డైట్ లెక్చరర్, డిఎల్, ఏడి మొదలైన గెజిటెడ్, ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ప్రమోషన్ పై వెళ్లేందుకు అవకాశం కల్పించాలన్నారు. టీజీటీలకు పీజీటీ యంఇఒ, తత్సమాన పోస్టులకు ప్రమోషన్‌లు కల్పించాలన్నారు. మోడల్ స్కూల్ సొసైటీని రద్దు చేసి, కమిషనరేట్, డీఈఓ ఆఫీసులు, పాఠశాలల్లో ఉన్న పోస్టులన్నింటినీ విద్యాశాఖలో విలీనం చేయాలన్నారు. స్కూల్‌తో పాటు కాలేజీకి కూడా 12వ తేదీన రీఓపెన్ చేయాలన్నారు. ప్రతిపాదనలంటిని పరిశీలించి పరిష్కరించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశులు

రైతులు అధిక దిగుబడులు సాధించాలి

జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-గుత్తి

శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలను పాటించి రాబోయే ఖరీఫ్ సీజన్‌లో రైతులు అధిక దిగుబడులను సాధించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం పట్టణంలోని సిఎల్ఆర్‌సి కార్యాలయంలో '2024 ఖరీఫ్ సాగుకు సయాయత్తం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న రైతులందరికీ రాయితీతో కూడిన నాణ్యమైన వేరుశెనగ విత్తనాలను ఇస్తున్నామన్నారు. అలాగే రైతులు అంతర పంటలను కూడా సాగు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ పీడీ మద్దిలేటి, ఎడిఎ ఎం.వెంకటరాముడు, శాస్త్రవేత్తలు నటరాజ్, భాస్కర్, చందన, ఎఫ్‌టిసి ఐ.శ్రీనివాసులు, గుత్తి మండల వ్యవసాయ అధికారి ముస్తాక్‌అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

పామిడి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం 'ఖరీఫ్ సాగుకు సమాయత్తం.. పంటల సాగుపై రైతులకు అవగాహన' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ ముఖ్య అతిథిగా హాజరై పంటల సాగుపై అవగాహన కల్పించారు. రైతులు, అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. హైబ్రిడ్ కందిరకాల గురించి వివరించారు. విత్తనాలు తీసుకున్నప్పుడు రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. జింక్, జిప్సం, గడ్డి మందులు అమౌంట్ కట్టిన వెంటనే ఆర్‌బికెలో అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త చందన మండల వ్యవసాయశాఖ అధికారిణి లీలా వసుంధర, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన భద్రత : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సార్వత్రిక ఎన్నికల కౌంటింగు రోజు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నట్లు ఎస్పీ గౌతమిశాలి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగు భద్రతా చర్యల్లో భాగంగా పోలీసులు వినియోగించే ఆయుధాలు, పరికరాల సంసిద్ధతను ఎస్పీ మంగళవారం తనిఖీ చేశారు. శాంతిభద్రతలు విఘాతం కలిగేలా ఏవైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నప్పుడు, అల్లర్లు, ఘర్షణలు తలెత్తిన సందర్భాల్లో సద్దుమణిచేందుకు, అల్లరి మూకలను చెదరగొట్టేందుకు వాడే గ్యాస్‌గన్, యాంటీ రైయిట్ గన్, ప్లాస్టిక్ పెల్లెట్స్, బాల్లిస్టిక్ క్యాట్రిడ్జిలు, తదితరాలను స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో ఉంచి ఒక్కో ఆయుధం ఎలా పని చేస్తుందో పరీక్షించారు. అన్నీ పక్కాగా పని చేసేలా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో కౌంటింగు ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా సమిష్టిగా పని చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజ, ఆర్‌ఐలు రెడ్డెప్పరెడ్డి, రాముడు, మధు, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ పెల్లెట్స్‌ను నిరీక్షిస్తున్న ఎస్పీ గౌతమిశాలి

ఆదమరిస్తే అంతే...

నిదనవాడ-తరిమెల మధ్య నడిరోడ్డుపై గోతి
పట్టించుకోని అధికారులు-భయాందోళనలో వాహనదారులు

ప్రజాశక్తి-శింగనమల

ఆదమరిచారా అంతే.. ఇప్పటికే దాదాపు కూలే దశలో కల్వర్టు..దీనికితోడు నడిరోడ్డుపై పెద్ద గోతి.. వాహనదారులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నారా.. ప్రమాదానికి గురికాక తప్పదు...

మండల పరిధిలోని నిదనవాడ-తరిమెల గ్రామాల మధ్య ఓ కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో నడిరోడ్డుపై గోతి పడింది. నిదనవాడ నుంచి కల్లూరు మీదుగా జాతీయ రహదారి వైపు నిత్యం వేలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయి. ముఖ్యంగా ఈ రోడ్డుపై రైతులు ఎప్పుడు పడితే అప్పుడు తోటలకు, ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. వారందరూ ఆదమరిచి వాహనం నడిపితే మాత్రం ప్రమాదం బారిన పడటం తథ్యం. రోడ్డుపై పెద్ద గోతి పడటంతో అటుగా వెళ్తున్న వాహనదారులు గోతికి గుర్తుగా మూడు పెద్ద బండరాళ్లు అడ్డుగా పెట్టారు. వాహనదారులు ఏమాత్రం ఏమరుపాటుగా వాహనం నడిపినా బండరాళ్ల తగిలి వాహనం బోల్తా పడే అవకాశం ఉంది. అంతేగాకుండా కల్వర్టు పూర్తిగా దెబ్బతినడంతో ఏక్షణంలోనైనా కూలిపోయే ప్రమాదమూ ఉంది. ఏదైనా పెద్ద వాహనం అటుగా వెళ్లిందంటే మాత్రం తప్పకుండా కూలే పరిస్థితిలో ఉంది. ఈ దారిలో ఎక్కువగా రైతులు ద్విచక్ర వాహనాల్లో తోటలకు వెళ్తుంటారు. దీనికితోడు పంటలను కూడా నాలుగు చక్రాల వాహనాల్లో తరలిస్తూ ఉంటారు. అలాంటి సమయంలో అప్రమత్తంగా లేకపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. గోతి పడి చాలా రోజులు అవుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టును కూల్చి కొత్తతి కట్టడంతోపాటు గోతిని పూడ్చాలని రైతులు, వాహనదారులు కోరుతున్నారు.

గోతికి అడ్డుగా పెట్టిన రాళ్లు

వైభవంగా నారసింహుడి రథోత్సవం

పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉరవకొండ మండలం పెన్నోబిలం క్షేత్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం మంగళవారం సాయంత్రం కన్నుల పండువగా సాగింది. ముందుగా స్వామివారి మూలవిరాట్‌కు విశేష పుష్పలంకరణ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం అందంగా అలంకరించిన ఉత్సవ విగ్రహాలను ఇఒ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారాకనాథ్‌స్వామి, బాలాజీస్వామి ఆధ్వర్యంలో పల్లకిలో ఊరేగింపుగా తీసుకెళ్లి రథంలో కొలువుదీర్చారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం బ్రాహ్మణుల ఆధ్వర్యంలో మడుగుతెరు లాగారు. సాయంత్రం ప్రత్యేక పూజలు చేసి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై కొలువుదీర్చి రథనాఙ్ను లాగారు. 'లక్ష్మీనరసింహస్వామి గోవిందా గోవింద' అంటూ భక్తులు స్వామి నామస్మరణతో పులకించిపోయారు. ఉత్సవానికి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక బృందాల ద్వారా ఉరవకొండ పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు

అవగాహన కార్యక్రమానికి హాజరైన కిశోర బాలికలు

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

శింగనమల : కిశోర బాలికలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి సూచించారు. మాసిక మహోత్సవంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని పెరవలి అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలను తప్పనిసరిగా చదివించాలన్నారు. అలాగే మంచి సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నెలసరి సమయంలో మంచి శక్తి ఇచ్చే ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు.ఇకపోతే బాల్య వివాహాలు చట్టరిత్యా నేరమన్నారు. బాలికలకు వివాహాలు చేస్తే శిక్షార్హులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ, అశ్వర్థమ్మ, కిశోర, బాలికల, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

యుగపురుషుడు ఎన్‌టిఆర్

అనంతపురం టిడిపి కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని మంగళవానం నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా భారీ కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అంబికా లక్ష్మీనారాయణ, దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్టీఆర్ టిడిపిని స్థాపించారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ చంద్రబాబు, లోకేష్ పని చేస్తున్నారన్నారు. కాగా జూన్ 4న జరిగే ఫలితాల్లో టిడిపి ఘన విజయం సాధిస్తుందన్నారు.

అలాగే టిడిపి జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి జెండాను జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. భారీ కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు ఆదినారాయణ, బుగ్గయ్యచౌదరి, స్వరూప, కొండవీటి సుధాకర్‌నాయుడు, గౌస్ మొహిద్దిన్, పోతుల లక్ష్మీ నరసింహులు, కూచి హరి, గంగారం, గోళ్ల సుధాకర్‌నాయుడు, నెట్టెం బాలకృష్ణ, సరిపూటి రమణ, రాజారావు, సుధాకర్‌యాదవ్, పూల బాషా, లక్ష్మీనరసింహా, కృష్ణకుమార్, జోగి రాజేంద్ర, జశ్వంత్ వ్యాస్, బండి విశ్వనాథ్, నాగభూషణ, కుమార్‌నాయుడు, రామకృష్ణ, కాకర్ల ఆదినారాయణ, సరిపూటి శ్రీకాంత్, భూలక్ష్మి, ఆయేషా, హరి, చెన్నప్ప, గురు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : టిడిపి జయంతిని పురస్కరించుకుని ఆ పార్టీ నాయకులు ఆకుల బాబు ఆధ్వర్యంలో మంగళవారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకుల విజయ్‌కుమార్

జయంతి కార్యక్రమాల్లో టిడిపి నాయకులు

(బాబు), మదమంచి ప్రతాప్‌చౌదరి, తిప్పన్న, సాలెహా, పాలగిరి నరేంద్ర, రాధాకృష్ణ, ప్రదీప్ ఆచారి, వినోదం కుళ్లాయప్ప, నాగభూషణ, బూసి, జెసిబి హరి, చంద్ర, వెంకటేష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే టిడిపి నాయకులు ఆలం వెంకట నరసానాయుడు ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు చంద్రబాబు, సుధాకర్, నాగేంద్ర, రాము, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : ఎన్టీఆర్ జయంతని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా కొండుగారికుంట గ్రామంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గరికపాటి సుదర్శనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి అభిమానులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలో విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి అంజళి ఘటించిన అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ప్రసాద్, నాయకులు మల్లికార్జున, పెద్ద తిప్పయ్య, గంగవరం వీరాంజనేయులు, నరిగన్న, ప్రతాపరెడ్డి, నక్కలపల్లి వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపిటిసి కంచరాముడు, ఆవులెన్న సర్పంచి రామ్మోహన్‌చౌదరి, ఎలగలవంక సురేష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పామిడి టిడిపి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మా మోహన్, నల్లబోతుల శీన, కరూరు శివ, ముసలిరెడ్డి, సత్య, నారాయణస్వామి, రాజేష్‌నాయక్, సుంకిరెడ్డి, సుంకప్ప, తిమ్మప్ప, పెద్ద రంగనాయకులు, హమాలీ గోపాల్, కొండాపురం రఫీ, అప్పన్నగారి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.మహబూబ్‌బాషా, పి.ధనార్జన, తెలుగు

కళ్యాణదుర్గంలో కేక్ కోస్తున్న టిడిపి నాయకులు

యువత నాయకులు లోకేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : ఎన్‌టిఆర్ ఆశయ సాధన కోసం అహర్నిశలు కృషి చేద్దామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. ఎన్‌టిఆర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ప్రజా వేదిక వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కోశారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసమే ఎన్టీఆర్ పార్టీని స్థాపించారన్నారు. ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సంక్షేమం కోసం కలిసికట్టుగా పని చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, రామ్మోహన్‌చౌదరి, లక్ష్మీనారాయణ, పాపంపల్లి రామాంజనేయులు, వైపి.రమేష్, సర్పంచి కవితా బుజ్జన్న, గోళ్ల వెంకటేశులు, వెలుగు లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శింగనమల గ్రామ కమిటీ అధ్యక్షులు బండి వెంకటనారాయణ, నాయకులు వెంకటేష్, మాసుల చంద్రమోహన్, పెద్ద నాగముని, సత్యనారాయణ, కొయ్యగూర పెద్దన్న, వెంకటేష్, వీరాంజనేయులు, నరేష్, రాజశేఖర్‌యాదవ్, చంద్రాయుడు, పాపన్న, చిన్న ఆంజనేయలు, రాముడు, జడేజా, బెస్త క్రిష్ణమూర్తి, చంద్ర, సురేష్, నాగరాజు, శంకర్, మసూద్‌వలి, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలకు 60,578 మంది రైతుల రిజిస్ట్రేషన్

కందుకూరు ఆర్‌బికెలో వేరుశెనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

అనంతపురం : ఖరీఫ్ సీజన్ సాగు కోసం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ కాయలు 53,475 క్వింటాళ్ల కోసం 60,578 మంది రైతులు రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా మంగళవారం 29 మండలాల్లో 38,419 మంది రైతులకు 33,895 క్వింటాళ్ల వేరుశనగ కాయలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ప్రశాంతంగా జీవించండి : ఎస్ఐ

మాట్లాడుతున్న ఎస్ఐ హేమాద్రి

పుట్లూరు : గ్రామాల్లో ప్రజలు ఎలాంటి గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ హేమాద్రి సూచించారు. మంగళవారం సాయంత్రం మండలంలోని కడవకల్లు ఏర్పాపు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాకాకుండా గొడవలు, అల్లర్ల వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ముఖ్యంగా ఎన్నికల ఫలితాల అనంతరం ఎవరూ ఎలాంటి ఉత్సాహాలు, గొడవలు, అల్లర్లకు పాల్పడకూడదన్నారు. ప్రజాశాంతికి ఎలాంటి భంగం కలిగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులుగా జానకిరాముడు

రాయదుర్గం : బహుజన్ సమాజ్ పార్టీ (బి.ఎస్.పి) రాయదుర్గం నియోజకవర్గ అధ్యక్షులుగా ఎం.జానకిరాముడును నియమించారు. ఈమేరకు బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు నుంచి నియామక పత్రాన్ని మంగళవారం అందుకున్నారు. ఈ సందర్భంగా జానకిరాముడు మాట్లాడుతూ తనకు పార్టీ అప్పగించిన బాధ్యతలను చూడా తప్పకుండా అమలు చేసి బలోపేతం చేస్తానన్నారు.

అశ్వవాహనంపై వెంకటరమణ స్వామి

అశ్వవాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు, అర్చకులు

రాయదుర్గం : బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వెంకటరమణస్వామి మంగళవారం ఆశ్వవాహనంపై విహరించారు. ఇందులో భాగంగా స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంపై ఉంచి కోటలోని ఆలయం నుంచి వినాయక కూడలి మెయిన్ బజార్ మీదుగా లక్ష్మీ బజార్ వరకూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి అధ్యక్షులు గౌని పాలాక్షిరెడ్డి, దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి నరసింహారెడ్డి, వైసిపి నాయకులు మెట్టు విశ్వనాథరెడ్డి, గౌని ఉపేంద్రరెడ్డి, మాధవరెడ్డి, నాగరాజురెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, ఆరెకటిక సంఘం నాయకులు శివకుమార్, రాయదుర్గం తాలూకా రెడ్డి సంఘం, ఆరకటిక సంఘం, తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగకాయల పరిశీలన

విత్తనకాయలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉన్న రైతు భరోసా కేంద్రంలో విత్తన వేరుశనగ విత్తన కాయలను సిపిఎం నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ వేరుశనగ విత్తన కాయలు నాసిరకంగా ఉన్నాయన్నారు. ఈ విత్తనాలు సాగుచేస్తే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు వెంటనే స్పందించి నాణ్యమైన విత్తనాలు దిగుమతి చేసుకుని 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎఒ, ఇతర వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించి రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రైతులను సమీకరించి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ వార్షికోత్సవ వేడుకలు

కార్యక్రమానికి హాజరైన అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా కేంద్రంలోని బళ్లారి బైపాస్ కోడిమి క్రాస్ వద్ద ఉన్న శ్రీ వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ముగిశాయి. విద్యాసంస్థల్లో భాగమైన ఆదర్శ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, ఫిజియోథెరపీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా క్రీడలు, వివిధ సాంస్కృతిక, సంప్రదాయ నృత్యాలతో అలరించారు. వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ కె.సతీష్ మాట్లాడుతూ నర్సింగ్, ఫిజియోథెరపీ విభాగంలో అందుబాటులో ఉన్న కోర్సులు బిపిటి, ఎంపిటి, బీఎస్సీ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ, జిఎన్ఎమ్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం డైరెక్టర్ రేవంత్ వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, వివిధ కళాశాలల నుంచి విచ్చేసిన అధినేతలకు మొమెంటోలు, శాలువాలతో సత్కరించారు. తర్వాత కరస్పాండెంట్ సతీష్ స్నాతకోత్సవ పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపల్ ఎ.లక్ష్మీనారాయణ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ యామిని, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE IV ADDITIONL DISTRICT JUDGE:: ANANTAPURAMU
I.A . NO: 82/2024 In OS.NO:30/2024

Between:
K.Gundaiah ...**Petitioner/plaintiff**
And
Patakamuri Subhashini and 2 others
...**Respondents/Defendents**

NOTICE TO RESPONDENTS/ DEFENDENTS NO. 1,2,3

Respondent/Defendent No.1
Patakamuri Subhashini D/o Medalamuri Subbaryudu (w/o Modi palli Kesavaiah Door No11-2-65, Nayak Nagar, Ananthapuramu city & Dist.
Respondent/Defendent No.2
Modipalli Kesavaiah S/o Modi palli Raja Gopal Door no 18-1-455, Venu Gopal Nagar, Ananthapuramu city & Dist
Respondent/Defendent No.3
K.Venkataraman S/o Gundaiah Door No 1-4-100-1, Janashakthi Narar H L C Colany, Ananthapuramu city & Dist.

ఇందుమూలంగా తెలియజేయడం ఏమనగా ప్రతివాదులైన (R1/D1, R2/D2, R3/D2,) మీ హాజరు నిమిత్తం పై కోర్టు నందు 24/06/2024 వ తేదిన వాయిదా ఉన్నది. కావున పై తేది రోజు ఉదయం 10:30 గంటలకు స్వతహాగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు నందు దాఖలు చేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించెదరు.

(By order of the court)

జగన్ అయ్యంగార్,
అడ్వకేట్, అనంతపురం

IN THE COURT OF THE HON'BLE IV ADDITIONL DISTRICT JUDGE:: ANANTAPURAMU
OS.NO:30/2024

Between:
K.Gundaiah ...**plaintiff**
And
Patakamuri Subhashini and 2 others
...**Defendents**

NOTICE TO DEFENDENTS NO. 1&2

Defendent No.1
Patakamuri Subhashini D/o Medalamuri Subbaryudu w/o Modi palli Kesavaiah Door No11-2-65, Nayak Nagar, Ananthapuramu city & Dist.
Defendent No.2
Modipalli Kesavaiah S/o Modi palli Raja Gopal Door no 18-1-455, Venu Gopal Nagar, Ananthapuramu city & Dist

ఇందుమూలంగా తెలియజేయడం ఏమనగా ప్రతివాదులైన (D1, D2,) మీ హాజరు నిమిత్తం పై కోర్టు నందు 24/06/2024 వ తేదిన వాయిదా ఉన్నది. కావున పై తేది రోజు ఉదయం 10:30 గంటలకు స్వతహాగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు నందు దాఖలు చేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించెదరు.

(By order of the court)

జగన్ అయ్యంగార్,
అడ్వకేట్, అనంతపురం

CHANGE OF NAME

I, Patala Gousiya Mehazabeen (old Name) W/o Shaik Fazlur Rahaman, residing at # 1-624, 3rd Road Extension, Near G R Function Hall Gate No.4, Ananthapur-515004, Changing my Name From Patala Gousiya Mehazabeen to **Shaik Gousia Mahajabeen** (New Name), Hence for, I am being Called as **Shaik Gousia Mahajabeen** for all Purposes.

ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయాలి : సిపిఎం

తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి వి.నిర్మల డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ భారతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వి.నిర్మల మాట్లాడుతూ గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు పరిహారాన్ని ఇవ్వాలన్నారు. జిల్లాలోని 29 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి కరువు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కావున ప్రభుత్వం 90శాతం రాయితీతో వేరుశనగ, కందులు, పెసలు, అలసందులు, ఆముదం, జొన్న వంటి విత్తనాలను ఉచితంగా రైతులకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.రేణుక, యు. మల్లికర్జున, ఆర్ఎన్.కవిత, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

మృతదేహాన్ని చూస్తున్న సాంబశివారెడ్డి

శింగనమల : మండల పరిధిలోని ఉల్లికంటిపల్లి గ్రామంలో అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న వైసిపి కార్యకర్త బి.బాలకృష్ణ (41) కుటుంబానికి అండగా ఉంటామని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి భరోసా ఇచ్చారు. మృతిచెందిన బాలకృష్ణ మృతదేహాన్ని మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకృష్ణ మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. కుటుంబానికి పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించి ఆర్థికసాయం అందజేశారు.

పాడి రైతులకు అందుబాటులో ఉండాలి

వెటర్నరీ సహాయ సంచాలకులు రత్నకుమార్

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని వివిధ పంచాయతీల వెటర్నరీ అసిస్టెంట్లు గ్రామాల్లోని పాడి రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని వెటర్నరీ సహాయ సంచాలకులు రత్నకుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో స్థానిక వైద్యులు గోవిందరాజులు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పంచాయతీల వెటర్నరీ అసిస్టెంట్లుతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ మండలంలోని పంచాయతీల్లో పాడి రైతులకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తూ రైతుల మన్ననలు పొందాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా, సమయపాలన పాటించకపోయినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు ఈ సమావేశంలో వెటర్నరీ అసిస్టెంట్లు యానిమల్ హస్బెండ్రీలు, తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవానికి అనుమతివ్వాలని వినతి


తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఉంతకల్లు గ్రామస్తులు

బొమ్మనహాల్ : మండలంలోని ఉంతకల్లు గ్రామంలో జూన్ 3న ప్రతి సంవత్సరం నిర్వహించే రుక్మిణీ పాండురంగ స్వామి రథోత్సవం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు స్థానికులు ప్రతాప్‌రెడ్డి, దేవిరెడ్డి తెలిపారు. ఈమేరకు తహశీల్దార్‌కు వినతిప్రతం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి గ్రామంలో స్వామివారి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవం జరుపుకుంటామని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందును ఉత్సవం జరుపుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, టమోటా వండరప్ప, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ

కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న నార్త్ సంస్థ సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఆదిమూర్తి నగర్‌లో ఉన్న లిటిల్ ఫ్లవర్ పాఠశాల ప్రాంగణంలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు మంగళవారం ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉత్తర అమెరికా తెలుగు సంఘం నాట్స్ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి (బాపు) మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే మహిళలు స్వశక్తితో ఎదగాలనే ఉద్దేశంతో కుట్టు మిషన్ల పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతపురం ఆర్డీటీతో కలిసి నల్లముల అటవీ ప్రాంతంలో ఉన్న మారుమూల గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ పాఠశాల అధినేత ఆంజనేయులు, నాయుడు, సాయి, అనిల్‌కుమార్ నార్త్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నిల్వనీటిపై మందు పిచికారీ

బొమ్మనహాల్ : నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు మురికి కాలువల్లో నిల్వ ఉన్న నీటిపై దోమల నివారణ మందు పిచికారీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శివయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా దోమల నివారణ మందు పిచికారీ చేసినట్లు తెలిపారు. కాగా ప్రజలు తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్స్ జయినాబీ, గోవర్ధన, ఆశావర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

10మందిపై రౌడీషీట్

పుట్లూరు : ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామంలో 10మందిపై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. వీరిలో టిడిపికి చెందిన ఆరుగురు, వైసిపికి చెందిన నలుగురు ఉన్నట్లు తెలిపారు.

విత్తన దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

అనంతపురం : విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎస్.మాసూమ్‌బాషా ఆదేశల మేరకు మంగళవారం జిల్లాకేంద్రంలోని విత్తన దుకాణాలపై దాడులు నిర్వహించారు. నగరంలోని పాతూరు గుత్తి రోడ్డులో ఉన్న ఎస్‌విఎస్ అగ్రి సొల్యూషన్స్, ఖాజానగర్‌లోని బాలాజీ ట్రేడర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్‌విఎస్ అగ్రి సొల్యూషన్స్‌లోని భౌతిక నిల్వల్లో వ్యత్యాసాలు, స్టాక్‌బోర్డు, రిజిస్ట్రర్లను సరిగా నిర్వహించకపోవడం వల్ల చట్ట ప్రకారం రూ.55,556 విలువజేసే విత్తనాలకు సంబంధించి స్థానిక వ్యవసాయాధికారి ద్వారా నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ కె.శ్రీనివాసులు, వ్యవసాయాధికారి వాసుప్రకాష్, ఎస్ఐ ఫణీంద్రనాథ్‌రెడ్డి, సిబ్బంది శశికళ, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల కుటుంబాలకు ఆర్థికసాయం

హోంగార్డ్ కుటుంబానికి ఆర్థికసాయం చెక్కు అందజేస్తున్న ఎస్పీ గౌతమిశాలి

అనంతపురం క్రైం : రోడ్డు ప్రమాదాలు, అనారోగ్యం కారణాలతో మృతిచెందిన ఇద్దరు హోంగార్డుల కుటుంబాలకు ఎస్పీ గౌతమిశాలి మంగళవారం ఆర్థికసాయం అందించారు. అనంతపురం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పని చేస్తున్న హోంగార్డు నిజాముద్దీన్ రెండున్నరేళ్ల కిందట చనిపోయాడు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న మరో హోంగార్డు నాగప్ప ఈఏడాది ఫిబ్రవరి 6న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో నిజాముద్దీన్ తండ్రి రుఖ్ముద్దీన్‌కు రూ.4,38,600, నాగప్ప భార్య ఉదయకు రూ.4,38,600 విలువజేసే చెక్కులను జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ ఛాంబర్‌లో అందజేశారు.

గణితం పరీక్షకు 55 శాతం గైర్హాజరు

అనంతపురం సిటీ : పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షకు 55శాతం మంది గైర్హాజరైనట్లు పరీక్ష ల విభాగం ఎసి గోవిందనాయక్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా మంగళవారం 45 సెంటర్లలో పరీక్షలు నిర్వహించగా 8,173 మంది హాజరు కావాల్సి ఉండగా 4,476 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మి తనిఖీ చేశారు.

జిల్లా సమగ్ర శిక్ష ఇన్‌ఛార్జి ఎపిసిగా డిఇఒ వరలక్ష్మి

అనంతపురం సిటీ : జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఎస్పీడీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే భాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

నార్పల : మండల కేంద్రంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మేంద్రస్వామి స్వామివారి మూలవిరాట్‌కు నెయ్యాభిషేకం, పంచామృతాభిషేకం, లక్ష్మీగణపతి హోమం, పుష్పాలంకరణ వంటి విశేష పూజలు చేశారు. అనంతరం భాగవత సప్తాహ భజనలు, షిరిడీ సాయిబాబా భక్తులు భజనలు చేశారు. తర్వాత అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

మాసిక మహోత్సవం

పెద్దపప్పూరు : మాసిక మహోత్సవంలో భాగంగా మండల కేంద్రంతోపాటు సింగనగుంటపల్లిలో కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆహారం, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఒ షాజిదాబేగం మాట్లాడుతూ కిషోర్ బాలికలకు సహజంగా కలిగే రుతుక్రమంపై అవగాహన ఉండాలన్నారు. రుతుక్రమ రోజుల్లో పరిశుభ్రంగా ఉండటంతోపాటు సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. అలాగే చట్టరిత్యా బాల్య వివాహాలు నేరమన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ డివి నారాయణమ్మ, రామలక్ష్మి, కిశోర బాలికలు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న పీడీ పి.వేణుగోపాల్‌రెడ్డి

బెలుగుప్ప : మండల పరిధిలోని కాలువపల్లి, గంగవరం గ్రామ పంచాయతీల్లో చేపట్టిన జాతీయ ఉపాధి హామీ పనులను జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులోఉ భాగంగా ఫారంపాండ్స్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, స్ట్రక్చర్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ క్లస్టర్ డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, ఎంపిడిఒ సుబ్బరాజు, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, ఎపిఒ సూర్యప్రకాష్, ఎపిడి అసిస్టెంట్ సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్లు నాగేంద్రప్ప, స్వాతి, ఫీల్డ్ అసిస్టెంట్ పెద్దన్న, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. పరికరాలు చోరీ

ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని ఎర్రంపల్లి గ్రామ శివారులోని రైతు కొల్లి సత్యనారాయణకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి అందులోని పరికరాలను చోరీ చేశారు. మంగళవారం ఉదయం తోటకు వచ్చిన సత్యనారాయణ గమనించి విషయాన్ని ట్రాన్స్‌కో అధికారి సలీమ్‌కు సమాచారం అందించారు. అనంతరం రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపాడు.

16 మంది బైండోవర్

పుట్లూరు : ఈనెల 4వతేదీన సాధారణ ఎన్నికల ఫలితాల సందర్భంగా మండలంలో 16 మందిని మంగళవారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ మల్లికార్జునస్వామి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.